ఈనాడు
epaper.eenadu.net

# 'పాలమూరు.. రంగారెడ్డి'కి 60% నిధులు

## కేంద్ర జలశక్తిశాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ హామీ

- జాతీయ హోదా ఇవ్వాలని కోరిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ప్రస్తుతం ఆ విధానం లేదన్న షెకావత్
- కేంద్ర మంత్రులు అమిత్‌షా, హర్‌దీప్ సింగ్‌లతోనూ సీఎం భేటీ
- విభజన సమస్యలు, ఐపీఎస్ క్యాడర్ పెంపు, మెట్రో రెండో దశ తదితర అంశాలపై వినతులు



అమిత్‌షాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఈనాడు, దిల్లీ: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 60 శాతం నిధులిస్తామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర జలశక్తిశాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ హామీ ఇచ్చారు. రేవంత్‌రెడ్డి గురువారం దిల్లీలో షెకావత్‌తో పాటు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురీలను కలిశారు. రాష్ట్ర విభజన సమస్యలు, ఐపీఎస్ క్యాడర్ పెంపు, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు జాతీయ హోదా, వివిధ పట్టణాభివృద్ధి ప్రాజెక్టులను వారి దృష్టికి తీసుకెళ్లారు. షెకావత్, పురీలను కలిసిన సమయంలో సీఎం వెంట రాష్ట్ర నీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా ఉన్నారు. దక్షిణ తెలంగాణలోని కరవు జిల్లాలకు సాగు, తాగునీరు అందించడానికి ఉద్దేశించిన పాలమూరు-రంగారెడ్డి పథకానికి జాతీయ హోదా కల్పించే అంశంపై కేంద్ర జలశక్తిశాఖ మంత్రితో సీఎం సుదీర్ఘంగా చర్చించారు. 2014 తర్వాత జాతీయ ప్రాజెక్టు అన్న విధానం లేదని, అందువల్ల కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇతర పథకాల కింద పాలమూరు-రంగారెడ్డికి 60 శాతం నిధులు సమకూరుస్తామని షెకావత్ హామీ ఇచ్చారు. ...మిగతా 3లో

Date : 05/01/2024 EditionName : GREATER HYDERABAD PageNo :

ఈనాడు
epaper.eenadu.net

# 'పాలమూరు-రంగారెడ్డి'కి 60 % నిధులు

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర మంత్రులతో సమావేశానంతరం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విలేకరులకు వివరాలు వెల్లడించారు. "డిసెంబరు 26న ప్రధానికి ఇచ్చిన వినతిపత్రంలో పాలమూరు-రంగారెడ్డి పథకానికి జాతీయ హోదా కల్పించి.. కేంద్ర నిధులు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. ఆ ప్రయత్నానికి కొనసాగింపుగా గురువారం కేంద్ర జలశక్తిశాఖ మంత్రిని కలిశాం. నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, వికారాబాద్, నారాయణపేట, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల్లో 12 లక్షల ఎకరాలకు సాగునీరు, 1200 గ్రామాలకు తాగునీరు ఇవ్వడానికి ఉద్దేశించిన పథకానికి కేంద్రం మద్దతు ఇవ్వాలని కోరాం. కేంద్ర జల సంఘం అనుమతులు త్వరగా ఇవ్వడంతో పాటు, జాతీయ ప్రాజెక్టు హోదా ఇచ్చి 60 శాతం నిధులను కేంద్రమే భరించాలని కోరాం. జాతీయ ప్రాజెక్టు అనే విధానం 2014 తర్వాత లేదని షెకావత్ పేర్కొన్నారు. అయితే ఈ ప్రాజెక్టును ఫ్లోరైడ్ ప్రభావిత కరవు ప్రాంతంలో నిర్మిస్తున్నందువల్ల కేంద్రం అమలు చేస్తున్న వేరే పథకం కింద నిధులు అందిస్తామని చెప్పారు. జాతీయ ప్రాజెక్టు హోదా వచ్చినా 60:40 నిధులు ఉంటాయని.. అందువల్ల వేరే పథకం కింద 60 శాతం నిధులు ఇస్తామని చెప్పారు" అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు గురించి కేంద్ర మంత్రితో చర్చించలేదని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కర్ణాటకలోని అప్పర్‌భద్రకు జాతీయ హోదా ఇచ్చిన విషయం గురించి విలేకరులు ప్రశ్నించగా.. ఆ ప్రాజెక్టు జాతీయ హోదానూ వెనక్కు తీసుకోబోతున్నట్టు కేంద్ర మంత్రి తమతో చెప్పారన్నారు.





కేంద్ర జలశక్తిశాఖ మంత్రి షెకావత్‌కు వినతిపత్రం అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ★ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురీతో మాట్లాడుతున్న రేవంత్

### మరో 29 ఐపీఎస్ పోస్టులు కేటాయించాలని అమిత్‌షాకు వినతి

తెలంగాణలో కొత్త జిల్లాలు ఏర్పడినందువల్ల రాష్ట్రంలో ఉన్న 79 మంది ఐపీఎస్ అధికారులకు తోడు మరో 29 మందిని కేటాయించాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇందుకు అమిత్‌షా సానుకూలంగా స్పందించారు. 2024 బ్యాచ్ నుంచి తెలంగాణకు అదనపు అధికారులను కేటాయిస్తామని చెప్పారు. ఇదే సందర్భంగా రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలోని 9వ షెడ్యూల్ సంస్థల విభజన పూర్తి చేయాలని, 10వ షెడ్యూల్‌లోని సంస్థల వివాదాన్ని పరిష్కరించాలని రేవంత్ కోరారు. దిల్లీలోని ఉమ్మడి రాష్ట్ర భవన్ విభజనను పూర్తి చేయాలన్నారు. చట్టంలో పేర్కొనని సంస్థలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తమవిగా చెప్పుకోవడంపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో యాంటీ నార్కోటిక్స్ బ్యూరో బలోపేతానికి రూ.88 కోట్లు, సైబర్ సెక్యూరిటీ బ్యూరో బలోపేతానికి రూ.90 కోట్లు కేటాయించాలని కోరారు. విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్, హైకోర్టు భవనం, లోకాయుక్త, ఎస్‌హెచ్ఆర్‌సీ భవనాలను ఉపయోగించుకున్నందువల్ల వడ్డీతో కలిపి ఆ రాష్ట్రం నుంచి రూ.408 కోట్లు ఇప్పించాలని రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

### రెండో దశ మెట్రోలో కేంద్రం కూడా భాగస్వామి కావాలి

హైదరాబాద్ రెండో దశ మెట్రో నిర్మాణంలో కేంద్ర ప్రభుత్వం కూడా భాగస్వామి కావాలని కేంద్ర పట్టణాభివృద్ధి, గృహనిర్మాణశాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురీని రేవంత్‌రెడ్డి కోరారు. బీహెచ్ఈఎల్-లక్డీకాపూల్, నాగోల్-ఎల్బీనగర్ మధ్య రూ.9,100 కోట్ల అంచనా వ్యయంతో తలపెట్టిన 26 కిలోమీటర్లు, రాయదుర్గం నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు రూ.6,250 కోట్ల అంచనా వ్యయంతో తలపెట్టిన 32 కిలోమీటర్ల హైదరాబాద్ మెట్రో రెండో దశను సవరించిన ప్రతిపాదనల ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టే విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధికి కేంద్రం అవసరమైన ఆర్థిక మద్దతు ఇవ్వాలని కోరారు. పేదల కోసం ఉద్దేశించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద చేపట్టేందుకు అనుమతి ఇవ్వాలన్నారు. తెలంగాణకు కొత్తగా అదనపు ఇళ్లు కేటాయించడంతోపాటు, పెండింగ్ బకాయిలనూ వెంటనే విడుదల చేయాలని కోరారు. ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రాష్ట్ర పట్టణాభివృద్ధి, పురపాలక వ్యవహారాల శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, నీటిపారుదలశాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్‌సీ మురళీధర్ పాల్గొన్నారు.

### నేడు యూపీఎస్సీ ఛైర్మన్‌తో భేటీ

శుక్రవారం ఉదయం 11 గంటలకు యూపీఎస్సీ ఛైర్మన్ మనోజ్ సోనీతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తాను, అధికారులు భేటీ కాబోతున్నట్లు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. "యూపీఎస్సీ తరహాలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను పకడ్బందీగా తీర్చిదిద్ది, గతంలోలా ప్రశ్నపత్రాల లీకేజీలు లేకుండా చేస్తామని రేవంత్‌రెడ్డి గతంలో ప్రకటించారు. అందులో భాగంగా పరీక్షల నిర్వహణలో యూపీఎస్సీ అవలంబిస్తున్న విధానాలను తెలుసుకుని టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేస్తాం" అని ఆయన పేర్కొన్నారు.

Date : 05/01/2024 EditionName : GREATER HYDERABAD PageNo :